క్లుప్తంగా

వినతులు త్వరగా పరిష్కరించాలి

చిత్తూరు అర్బన్: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ఎక్కడ కూడా నిర్లక్ష్యం చేయొద్దని, పీజీఆర్ఎస్ వినతులను త్వరగా పరిష్కరించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్ ప్రసాద్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. ఇంజినీరింగ్, మెప్మా, రెవెన్యూ విభాగాలకు సంబంధించి పలు ఫిర్యాదులు అందాయి. వీటిని క్షేత్రస్థాయిలో విచారించి, నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

వరసిద్ధునికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని గోసంరక్షణ, అన్నదాన ట్రస్టుకు ఓ దాత సోమవారం నగదు విరాళంగా అందించారు. తెలంగాణలోని వరంగల్ జిల్లాకు చెందిన హనుమంతరావు అన్నదానం ట్రస్టుకు రూ.3 లక్షలు, గోసంరక్షణ ట్రస్టుకు రూ.ఒక లక్ష అందజేశారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ అధికారులు స్వామి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నగరంలో విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఉంటుందన్నారు. కొంగారెడ్డిపల్లె, కట్టమంచి, మురుగానిపల్లె, ఆఫీసర్‌లైన్, సాంబయ్యకండ్రిగ, కామేశ్వర్‌నగర్, విజయనగర్‌కాలనీ, నీమ్‌గార్డెన్, మల్లికార్జునకాలనీ, బీవీరెడ్డికాలనీ, మహదేవనాయుడుకాలనీ, గురునగర్‌కాలనీ, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు మార్పును గమనించాలని వివరించారు.

మొగిలి వెంకటగిరిలో ఓంశక్తి పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలివెంకటగిరి దళితవాడలో ఆదివారం రాత్రి ఓంశక్తి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఓంశక్తి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. అనంతరం ఆలయం వద్ద ఓం ఆకారం ఏర్పాటు చేసి చుట్టూ దీపాలను వెలిగించి పూజలు చేసి భక్తి కీర్తనలు ఆలపించారు. అనంతరం భక్తులు గ్రామంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుశక్తులు గోవిందయ్య, సోమశేఖర్, నరేష్, కుమారి, అమరన్, భక్తులు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సలో విజయం సాధించాం



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): అరుదైన మెదడు శస్త్ర చికిత్స నిర్వహించినట్లు అమ్మ ఆస్పత్రి న్యూరో సర్జన్ డాక్టర్ కల్యాణ్‌బాబు తెలిపారు. చిత్తూరు నగరంలోని అమ్మ ఆస్పత్రిలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో చికిత్స వివరాలను వెల్లడించారు. నగరానికి చెందిన వసంతమ్మ (75) రెండు వైపులా బ్రెయిన్ పక్షవాతానికి గురై ఆస్పత్రికి వచ్చారన్నారు. ఆమెకు సుమారు 13 గంటల పాటు శ్రమించి రెండు పక్కల శస్త్రచికిత్సను విజయవంతం చేశామన్నారు. నగరానికి చెందిన మరో వృద్ధుడు వేణుగోపాల్(70) బ్రెయిన్‌లో రక్తం గడ్డకట్టడంతో మాటలు కూడా కోల్పోయి ఆస్పత్రికి వచ్చారన్నారు. ఇలా వృద్ధులకు సర్జరీలు చేస్తే నయమవడం చాలా కష్టమనే అపోహలను పక్కన పెట్టాలని చెప్పారు. అనంతరం పల్మనాలజీ డాక్టర్ అశోక్ మాట్లాడుతూ చిత్తూరులో కూడా ఇలాంటి సర్జరీలు జరుగుతున్నాయనే విషయాన్ని గుర్తించాలని ఆయన పేర్కొన్నారు.

ఇంటింటికీ వైద్యం పేదలకు వరం



వైద్యం చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: ఇంటింటికీ వైద్యం అందించడం పేదలకు వరమని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎగువ వెంకటాపురంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు 42 మంది రోగులకు వైద్య సేవలందించి సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజామణి, డీపీఎంఓ మణి, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎస్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ముంచెత్తిన మంచు




బంగారుపాళెం : పట్టణాన్ని కమ్మేసిన మంచు



బంగారుపాళెం: చలి కాచుకుంటున్న కూలీలు



బంగారుపాళెం : జాతీయ రహదారిపై లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనాలు





చిత్తూరు: వేలూరు రోడ్డు, మున్సిపల్ పార్కులో కమ్మేసిన మంచు

దట్టమైన మంచు వణికించే చలితో చిత్తూరు ప్రాంతం లంబసింగిని తలపించింది. ఆదివారం ఉదయం జల్లులు కురువడంతో రోజంతా చల్లటి వాతావరణం నెలకొంది. సోమవారం ఉదయం 9 గంటల వరకు పొగమంచు కప్పేసింది. రోడ్డు సరిగా కనిపించకపోవడంతో వాహనాలు లైట్లు వేసుకుని నెమ్మదిగా వెళుతూ కనిపించాయి. బంగారుపాళెం పట్టణాన్ని ఉదయం 5.30 గంటల నుంచి 8.30 గంటల దట్టమైన పొగ మంచు ముంచెత్తేసింది. చలి తీవ్రంగా ఉండటంతో వృద్ధులు, చిన్నారులు వణికిపోయారు. వేకువ జామున కొబ్బరి బోండాల కోతకు వెళ్లే కూలీలు చలిమంటలు వేసుకుని చలి కాసుకున్నారు. తవణంపల్లె మండలంలోనూ పొగమంచు కమ్మేసింది. రైతులు పొలం పనులకు వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు.

– చిత్తూరు కార్పొరేషన్/ బంగారుపాళెం/తవణంపల్లె





చిత్తూరు: పొగమంచుతో నిండిపోయిన గంగినేని చెరువు



బంగారుపాళెం : జాతీయ రహదారిలో ఆవరించిన పొగమంచు



తవణంపల్లె: దిగువ మోదలపల్లెను కమ్మేసిన దట్టమైన పొగమంచు

కుష్ఠు నిర్మూలనకు సమష్టిగా కృషి చేద్దాం



కుష్ఠునివారణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

బంగారుపాళెం: సమాజంలో కుష్ఠువ్యాధి నిర్మూలన కోసం సమష్టిగా కృషి చేద్దామని మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్ అన్నారు. ఆయన సోమవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో కుష్ఠువ్యాధి గ్రస్తుల సర్వేపై ఏఎస్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మండలంలో ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కుష్ఠువ్యాధి గ్రస్తుల గుర్తింపు కోసం ఇంటింటా సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, కాళ్లు చేతులు తిమ్మెర్లు, జోము కలిగి ఉండడం వంటి లక్షణాలు ఉంటే వారిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ల వద్ద పరీక్షలు నిర్వహించుకునేలా చూడాలన్నారు. కుష్ఠువ్యాధి ద్వారా వచ్చే వైకల్యాన్ని నివారించేందుకు కలసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. డాక్టర్ రమేష్, డీపీఎం మణి, సీహెచ్‌ఓ నాగమణి, ఎంపీహెచ్‌ఈఓ రమేష్‌బాబు, హెల్త్ సూపర్‌వైజర్లు హరికృష్ణ, అముద పాల్గొన్నారు.

గర్భిణులకు ఇంటి వద్దే వైద్యం అందిస్తున్నాం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: గర్భిణులకు ఇంటివద్దే వైద్యం అందిస్తున్నామని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత అన్నారు. సోమవారం పానాటూరులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులకు ఇంటివద్దకే వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. అనంతరం బీపీ, షుగర్ వ్యాధులకు సంబంధించి రోగులకు చికిత్సలు చేసి మందులు, మాత్రలను అందజేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ఇంటిచుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శివగామి, మనిమేఘల, వీరలక్ష్మి, ప్రియాంక, భారతి పాల్గొన్నారు.

దళిత మహిళకు న్యాయం చేయాలి



ధర్నా చేస్తున్న మునెమ్మ, సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: దళిత మహిళ మునెమ్మకు చిత్తూరు తహసీల్దార్ న్యాయం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధితురాలు, ఆ సంఘం నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు దుర్గానగర్ కాలనీ సమీపంలో ఇంటి పట్టాను మునెమ్మకు 1997లో ప్రభుత్వం అందజేసిందన్నారు. అయితే ఆ పట్టాను కాదని స్థలం కోసం అక్కడి అగ్రవర్ణాలు ఆమెపై దాడి చేసి గాయపరిచారని చెప్పారు. దళిత మహిళపై దాడి చేయడంతో పాటు సర్వ హక్కులున్న ఆమె స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అధికార పార్టీ అండదండలతో దళిత మహిళపై దాడులు చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాధిత మహిళ మనెమ్మ, నాయకులు ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్యాన సప్తాహం

బంగారుపాళెం: మండలంలోని బోడబండ్ల గ్రామంలో మంగళవారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు ధ్యానసప్తాహం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బోడబండ్ల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక శివశక్తి పిరమిడ్ ధ్యాన మందిరంలో సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ధ్యాన జ్ఞాన సప్తాహ కార్యక్రమం ఉంటుందన్నారు. పలమనేరు పట్టణానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ జిసి బాలాజీ ధ్యాన సాధన, ఫలితాలపై అవగాహన కలిప్తారన్నారు. ధ్యానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాహుకేతు పూజలు



మొగిలిలో అన్నదానం చేస్తున్న దాతలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాహుకాల సమయం ఉదయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజ కార్యక్రమాలను చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దోష నివారణ చేసుకున్నారు

అన్న ప్రసాదాల వితరణ

మొగిలి శివాలయానికి వచ్చే భక్తులకు ప్రతి సోమ వారం అన్నప్రసాదాలు అందించేందుకు తిరుపతికి చెందిన దాతలు ధరణి, నిత్య ముందుకు వచ్చారని ఆలయ కార్యనిర్వాహణాధికారి మునిరాజు తెలి పారు. దాతల సహకారంలో ఇక ప్రతి సోమవారం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. దాతలకు ఆలయ నిర్వాహకులు మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వారి దర్శనం కల్పించారు.

వరసిద్ధుని సేవలో సీఈ



మాస్టర్ ప్లాన్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న దేవదాయశాఖ అధికారులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని సోమవారం దేవదాయశాఖ సీఈ శేఖర్, స్థపతి పరమేశ్వరప్ప సందర్శించారు. నూతన అన్నదానం, వినాయక సదన్ తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. కోనేరు మార్పిడి మాస్టర్ ప్లాన్‌ను అధికారుల పరిశీలించారు. ఈవో పెంచల కిషోర్, ఈఈ వెంకట నారాయణ, శాఖ ప్రధాన కార్యాలయ ఈఈ గంగయ్య, రవి, ఏఈవో రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'జీవన్ ప్రమాణ్' నమోదు



ధ్రువీకరణ పత్రాలను నమోదు చేస్తున్న సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు సబ్ ట్రెజరీ కార్యాలయంలో జీవన్ ప్రమాణ్ ధ్రువీకరణ పత్రాల నమోదు పకడ్బందీగా చేపడుతున్న చిత్తూరు ఎస్టీవో చంద్రశేఖర్ అన్నారు. చిత్తూరు సబ్ ట్రెజరీ కార్యాలయంలో సోమవారం నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు సబ్ డివిజన్ పరిధిలోని రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారులు తమ జీవన్ ప్రమాణ్ ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా ఫిబ్రవరి 28వ తేదీ లోపు అందజేయాలని సూచించారు. జీవన్ ప్రమాణ్ అప్లికేషన్, ఫేస్ అప్లికేషన్‌లో ఈ ధ్రువీకరణ పత్రాలు నమోదు చేయవచ్చన్నారు. వేలి ముద్రలు సరిగ్గా పడని వారు, మంచానికే పరిమితమైన పింఛనుదారులు చిత్తూరు ఎస్టీవో కార్యాలయంలో వివరాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గణాంకాధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.

అత్యాచార దోషికి జీవిత ఖైదు హర్షణీయం

చిత్తూరు కలెక్టరేట్: కోల్‌కతా డాక్టర్ అత్యాచార కేసులో దోషి సంజయ్ రాయ్‌కు జీవిత ఖైదు విధించడం హర్షణీయమని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా కోల్‌కత్తా ఆర్.జి.కర్ ఆస్పత్రి డాక్టర్‌పై అత్యాచారం సంచలనం సృష్టించిందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల పోరాటంతోనే ఘటన జరిగిన కేవలం ఐదు నెలల్లోనే దోషికి శిక్ష పడిందన్నారు.

హెల్మెట్ భారం కాదు.. భద్రత



హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్, సీఐ

బంగారుపాళెం: ద్విచక్రవాహన చోదకులకు హెల్మెట్ ప్రాణ రక్షణ అనే విషయాన్ని మరువరాదని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, సీఐ శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం హెల్మెట్ వినియోగంపై పోలీసులు అవగాహన ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపి ప్రమాదాల బారినపడి ప్రాణా లు పోగొట్టుకుంటున్నట్లు ఇటీవల కేంద్ర హోంశాఖ నిర్వహించిన ఓ సర్వేలో వెల్లడైందని చెప్పారు. ఈ నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ మధుసూదన్ పాల్గొన్నారు.

చైర్‌పర్సన్‌ను కలిసిన జిల్లా అధికారి



చైర్మన్‌ను సత్కరిస్తున్న జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరుకు సోమవారం విచ్చేసిన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ చైర్మన్ శ్రీనివాసులును జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం జిల్లాలో అమలవుతున్న గిరిజన సంక్షేమ కార్యక్రమాలపై కాసేపు చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తత అవసరం





చుక్కావారిపల్లెలో పశువుల వైద్యశిబిరానికి తరలివచ్చిన పశువులు, పాడి ఆవును తీసుకొస్తున్న మహిళా రైతు



బొమ్మసముద్రంలో పాడిపశువులకు మందు తాగిస్తున్న వైద్యాధికారులు

గుడిపాల: పాడి పశువులకు సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారులు సాయిసుధ, రవితేజ అన్నారు. చుక్కావారిపల్లె, బొమ్మసముద్రంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాడి పశువులకు గాలికుంటు వ్యాధి, పొదుగువాపు వ్యాధి, గొంతువాపు వ్యాధి వంటి సీజనల్ వ్యాధులు సోకుతున్నాయని తెలిపారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వ్యాధుల నుంచి పశువులను రక్షించుకోవచ్చన్నారు. జ్వరం, గొంతువాపు, ముక్కులో నుంచి చీమిడి కారడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే పశువైద్యాధికారుల సమక్షంలో వైద్యం అందించాలని సూచించారు. అనంతరం 300 పశువులకు పిడుదుల మందు పిచికారీతోపాటు డీ వార్మింగ్ మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది అబ్దుల్లా, జ్యోత్స్న, వెంకటేశులు, షఫీ, కిషోర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.